సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 22 । జూన్ । 2025



**మాట నిలుపుకుంటా**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



**ఆలయ అభివృద్ధికి కృషి**

జిల్లాకేంద్రంలోని పంచముఖ హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /23.4

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### 'పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి'



**తాడ్వాయి:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. శనివారం తాడ్వాయిలోని ఐకేపీ కార్యాలయంలో ఏఎల్‌ఈఏపీ, ఆర్‌ఏఎంపీ కార్యక్రమంలో భాగంగా గ్రామీణాభివృద్ధి సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల ఆధ్వర్యంలో ఔత్సాహిక మహిళలకు ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెలకువలు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఆచరణీయ పరిశ్రమలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం రమేష్‌బాబు, ప్రాజెక్టు ఆఫీసర్ ఖాసిం, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి లాలూనాయక్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఏపీఎం మనోహర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద, సీసీలు, 11 మండలాల మహిళా వ్యాపారస్తులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డి ఎఫ్‌ఆర్‌వోపై సస్పెన్షన్ వేటు

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓంకార్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ సువర్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని అటవీశాఖ అధికారులు తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో ఆయనపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

### యూరియా కొరత లేదు



**సదాశివనగర్:** జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన పద్మాజీవాడి సింగిల్ విండో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల లభ్యతపై రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రైతులకు సరిపడ యూరియా ఉందన్నారు. తొందర పడి ఎరువులను ఇంట్లో నిలువ ఉంచుకోవద్దన్నారు. రైతులు అవసరాన్ని బట్టి యూరియాను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రజాపతి, ఏఈవోలు శ్రీలక్ష్మి, గాయత్రి, విండో సీఈవో దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

**రికార్డులను పక్కాగా నమోదు చేయాలి**

**నస్రుల్లాబాద్:** ఎరువుల వివరాలను తెలిపే రికార్డులను పక్కాగా నమోదు చేయాలని డీఏవో తిరుమల ప్రసాద్ సూచించారు. శనివారం నస్రుల్లాబాద్, మైలారం, దుర్కి గ్రామాల్లోని సొసైటీల గోదాములను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అంకోల్ గ్రామంలో నాట్లు వేస్తున్న రైతులతో మాట్లాడి నాట్లలో మెలకువలను వివరించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకే యూరియా వాడాలన్నారు. ఆయన వెంట ఏవో భవాని, ఏఈవో గోపాల్ తదితరులున్నారు.

### రేపు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

**కామారెడ్డి అర్బన్:** తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశాలకోసం సోమవారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా క్రీడలు, యువజన అధికారి జగన్నాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎత్తు, బరువు, ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, షటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, మెడిసిన్ బాల్‌పుట్, 800 మీటర్ల రన్, మెడికల్ టెస్ట్‌లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### పసుపు బోర్డు ప్రారంభ కార్యక్రమానికి తరలిరావాలి

**ఆర్మూర్:** నిజామాబాద్‌లో ఈనెల 29న నిర్వహించే పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి రైతులు తరలిరావాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అనిల్, నాయకులు పొల్కం వేణు, ఆకుల రాజు, పాన్ శీను, జాకిర్దర్ శీను, సుంకరి రంగన్న, గుగులోత్ తిరుపతి నాయక్, ఖాందేశ్ ప్రశాంత్, బాండ్లపల్లి నర్సారెడ్డి, చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో మద్యనిషేధ తీర్మాన పత్రాన్ని చూపుతున్న గ్రామస్తులు(ఫైల్)

# మందు.. బందు

**మద్యం మహమ్మారి ప్రజల జీవితాలతో** ఆడుకుంటోంది. బెల్ట్ షాప్‌ల ఏర్పాటుతో దాని కోరలు మరింత విస్తరించాయి. కొందరైతే పొద్దస్తమానం మద్యం తాగుతూ మత్తులోనే జోగుతున్నారు. మత్తులో గొడవలు, అనర్థాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చైతన్యవంతులవుతున్న పలు గ్రామాల ప్రజలు మద్య నిషేధం వైపు అడుగులు వేస్తున్నారు. తమ గ్రామంలో మద్యం విక్రయించకుండా కట్టడి చేసుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- చైతన్యవంతం అవుతున్న పల్లెలు
- గ్రామాల్లో మద్యం అమ్మకుండా కట్టడి
- విక్రయిస్తే భారీ జరిమానాలు.. సమాచారం ఇచ్చిన వారికి నజరానాలు



సండే స్పెషల్

**కు**టుంబాలలో చిచ్చుపెడుతున్న మద్యం మహమ్మారిపై ప్రజలు పోరుబాట పట్టారు. ముఖ్యంగా పల్లెల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టుషాపులతో ఇళ్లు, ఒళ్లు గుల్ల వుతుండడం, కుటుంబాల్లో కలహాలు చెలరేగుతుండడంతో అందరూ ఏకమై మద్యం అమ్మకుండా కట్టడికి నడుం బిగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని గ్రామాలలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్య నిషేధం అమలు చేసుకుంటున్నారు. బెల్ట్ షాపులు నిర్వహించకుండా కట్టడికి యత్నిస్తున్నారు. మద్యం అమ్మితే జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు పలు గ్రామాలలో ఇప్పటికే తీర్మానాలు చేశారు.

**రాజంపేట మండలంలో..**

రాజంపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు చైతన్యవంతులై మద్యానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. మండలంలోని మారుమూల గ్రామాల్లోనూ బెల్టు షాపులు ఏర్పాటవడం, పొద్దస్తమానం మద్యం అమ్ముతుండడంతో చాలా మంది తాగుడుకు అలవాటు పడ్డారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో మద్యం చిచ్చు పెడుతోంది. తాగిన మైకంలో కొందరు కుటుంబ సభ్యులను దూషించడం, కొట్టడం, తాగడానికి డబ్బులు ఇవ్వాలని కుటుంబ సభ్యులను వేధించడం వంటి సంఘటనలు పెరిగాయి. మగవారు చాలా మంది తాగుడుకు అలవాటు పడి పనులు కూడా చేయడం లేదని, దీంతో కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వివిధ గ్రామాలు, తండాలలో మద్యం అమ్మకాలు ఆపేందుకు ప్రజలు తీర్మానాలు చేసుకుంటున్నారు. కొండాపూర్, గుండారం, గుడితండా, శేర్ శంకర్ తండా, నడిమితండా, ఎల్లాపూర్ తండాలలో మద్యం కూడదంటూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. మద్యం అమ్మితే జరిమానా విధించాలని, మద్యం అమ్ముతుండగా పట్టుకున్నవారికి ప్రోత్సాహక బహుమతి అందించాలని ఆ తీర్మానాల్లో పేర్కొన్నారు. గుండారం, నడిమితండా, ఎల్లాపూర్ తండాలలో అయితే ఎవరైనా మద్యం అమ్మినట్టు తేలితే రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు ఏడు చెప్పుదెబ్బలు కొట్టాలని నిర్ణయించారు. అలాగే మద్యం అమ్ముతున్నట్టు ఎవరైనా సమాచారం ఇస్తే వారికి రూ.20 వేలు నజరానా ఇవ్వాలని తీర్మానించారు. దీంతో ఆయా గ్రామాలలో బెల్ట్‌షాప్‌లు మూతపడ్డాయి. మరి కొన్ని గ్రామాలు సైతం వీరి బాటలో నడవడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

**పొద్దస్తమానం తాగుతున్నరు**



తండాలోనే మద్యం దొరుకుతుండడంతో కొందరైతే పొద్దస్తమానం తాగుతూనే ఉన్నరు. తాగుడు వల్ల పనులు చేసుకోలేకపోతున్నరు. డబ్బులు కూడా నష్టపోతున్నరు. ఆరోగ్యం దెబ్బతింటోంది. అందుకే ఊళ్లో మద్యం దుకాణాలు ఉండొద్దని తీర్మానం చేసినం.

– రామోత్ శంకర్, గుడి తండా



గుండారంలో వివరాలు తెలుపుతున్న గ్రామస్తులు (ఫైల్)

**అందరం కలిసి తీసుకున్న నిర్ణయం**



గ్రామంలో మద్యం దొరకడం వల్ల చాలా మంది తాగుడుగు అలవాటైతున్నరు. మద్యానికి అలవాటై వ్యవసాయ పనులకు కూడా వెళ్లడం లేదు. వయసు పోరగాండ్లు కూడా పొద్దస్తమానం తాగుతున్నరు. దీంతో గ్రామస్తులందరం కలిసి మందు అమ్మవద్దని తీర్మానం చేసుకున్నం.

– దర్శనం సాయిలు, గుండారం

**అందరూ చెడిపోయే పరిస్థితి..**



ఎప్పుడు కావాలంటే అప్పుడు ఊర్ల మందు అమ్ముతుంటే చాలా మంది తాగుడుకు అలవాటైతున్నరు. అందరూ చెడిపోయే పరిస్థితి ఉంది. ముఖ్యంగా యువకులు చాలా మంది మందు తాగుతున్నరు. ఇది మంచిది కాదనే కట్టడి చేసింన్రు.

– కుమ్మరి బ్రహ్మం, గుండారం

**చాలా మంది అలవాటుపడ్డరు**



ఊర్లో ఎప్పుడంటే అప్పుడు మందు దొరుకుతోంది. దీంతో చాలామంది తాగుడుకు అలవాటు పడ్డరు. తాగడానికి రోజూ వందలు ఖర్చవుతున్నయి. కొందరైతే పనులు కూడా చేస్తలేరు. దీంతో గ్రామంల అందరం కూర్చొని మద్యం అమ్మవద్దని నిర్ణయం తీసుకున్నం.

– సిద్దయ్య, కొండాపూర్

# ఘనంగా యోగా డే



లింగంపేట నాగన్నగారి మెట్ల బావిలో పద్మాసనం వేసిన విద్యార్థులు

**కామారెడ్డి అర్బన్/లింగంపేట:** జిల్లాలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యోగా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతి విద్యామందిర్‌లో ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చందర్ పాల్గొన్నారు.

**మెట్ల బావిపై..**

లింగంపేట మండలంలోని నాగన్నగారి మెట్ల బావిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపారు. అధికారులు, విద్యార్థులు మెట్లపై నిల్చొని యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. యోగా శారీరకంగా, మానసికంగా శక్తిమంతులను చేస్తుందన్నారు. జిల్లాలో 32 యోగా కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. అందులో వేలాది మంది శిక్షణ పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, డీపీవో మురళి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఎల్‌పీవో సురేందర్, జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ సురేష్, ఎంఈవో శౌకత్‌అలీ, ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



మెట్ల బావి వద్ద యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

# రైతు పొలంలో తెల్ల జెండాలు



రైతు పొలంలో సహకార సంఘం అధికారులు పాతిన తెల్ల జెండాలు

- రుణం చెల్లించలేదని వేలం నోటీసు ఇచ్చిన సొసైటీ
- అప్పు కట్టేందుకు అంగీకరించడంతో వేలం రద్దు

**లింగంపేట:** సహకార బ్యాంకులో తొమ్మిదేళ్ల క్రితం తీసుకున్న అప్పు చెల్లించనందుకు రైతు భూమిని వేలం వేయాలని సహకార బ్యాంకు అధికారులు నిర్ణయించారు. అప్పు కట్టడానికి రైతు అంగీకరించడంతో వేలం రద్దయ్యింది. వివరాలిలా ఉన్నాయి. నల్లమడుగు గ్రామానికి చెందిన సంగారెడ్డిపేట శ్రీనివాస్ అనే రైతు పాడి పరిశ్రమ కోసం 2016 సంవత్సరంలో రూ. 4.32 లక్షలు సహకారం బ్యాంకు నుంచి రుణం తీసుకున్నాడు. అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో రుణం చెల్లించలేకపోయాడు. దీంతో అప్పు వడ్డీతో కలిపి రూ. 9.26 లక్షలకు చేరింది. రుణ రికవరీ కోసం బ్యాంకు అధికారులు శ్రీనివాస్‌కు నోటీసులు ఇచ్చారు. ఇటీవల భూమి వేలం వేయనున్నట్లు ప్రకటించారు. రైతు భూమిలో తెల్ల జెండాలు పాతడంతోపాటు వేలం గురించి గ్రామంలో ప్రచారం కూడా చేశారు. దీంతో ఆందోళన చెందిన రైతు శనివారం బ్యాంకుకు వెళ్లి అధికారులతో మాట్లాడాడు. అప్పు చెల్లించడానికి గడువు కోరాడు. దీంతో సదరు రైతు భూమి వేలం రద్దు చేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ కుమారస్వామి తెలిపారు. ఈ నెలాఖరు వరకు రుణం చెల్లిస్తే రూ. 2.40 లక్షలు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

# విద్యార్థులపై ఆర్టీసీ బాదుడు

- భారీగా పెరిగిన బస్‌పాస్ చార్జీలు
- జనరల్, స్టూడెంట్ పాస్‌లపై యాభై శాతం వరకు పెంపు

**కామారెడ్డి టౌన్:** ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను భారీగా పెంచింది. జనరల్, స్టూడెంట్ పాస్ చార్జీలు యాభై శాతం వరకు పెరిగాయి. దీంతో ప్రజలపై అదనపు భారం పడనుంది. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఇవి అమలులోకి వచ్చాయి.

**సాధారణ ప్రయాణికులపై...**

ఆర్టీసీ జిల్లాలో 80 కిపైగా రూట్లలో బస్సులు నడుపుతోంది. ఆయా రూట్లలో రోజూ లక్ష మందికిపైగా ప్రయాణిస్తుంటారు. అలాగే సంస్థ జనరల్, స్టూడెంట్, దివ్యాంగులు, డయాలసిస్ పేషెంట్లకు బస్‌పాసులను జారీ చేస్తుంది. జిల్లాలో నెలవారీ సీజన్ టికెట్‌పై ఆధారపడి 4 వేల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర ప్రయాణికులు టికెట్ పెంపుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది తమకు అదనపు భారమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తే ఆర్టీసీ ఆదాయంపై ప్రభావం చూపనుంది. టోల్ యూజర్ చార్జీల పెంపుతో దూర ప్రాంత ప్రయాణికులు అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది.



కామారెడ్డి డిపో ఆవరణలోని బస్‌పాస్ కౌంటర్

**గతేడాది జారీ చేసిన బస్‌పాస్‌లు**

| | |
|---|---|
| స్టూడెంట్ పాస్‌లు | 6,239 |
| దివ్యాంగులు | 1,634 |
| సీజనల్ | 405 |
| ఎస్కార్ట్ | 211 |
| దయాలసిస్ | 42 |

**విద్యార్థులకూ ఆర్థిక భారమే..**

**జి**ల్లాలో రెండు డిపోల పరిధిలో గతేడాది 6 వేల మందికిపైగా విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్‌లను వినియోగించారు. ఎక్కువగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారే ఉంటారు. ఇప్పటికే స్కూల్ ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్టీసీ పెంచిన బస్ పాస్‌చార్జీలు మరింత భారం కానున్నాయి. కాగా స్టూడెంట్ నెలవారీ పాస్‌లకు సంబంధించి పెరిగిన ధరలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదు. నెలవారీ పాస్ దరఖాస్తు చేసుకునే సమయంలో రూట్‌వారీగా ఆన్‌లైన్‌లో కనిపించే పెరిగిన బస్‌పాస్ చార్జీల ఆధారంగా పాస్ జారీ చేయనున్నారు.

**బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి**

మా మండల కేంద్రం నుంచి రోజు జిల్లా కేంద్రంలోని కళాశాలకు బస్సులో వస్తుంటాను. ఇంతకుముందు నెలవారీగా బస్‌పాస్ ధర రూ. 300 ఉండేది. ప్రస్తుతం ధర పెంచడంతో అదనపు భారం తప్పదు. పెంచిన పాస్‌ల ధరలు తగ్గించాలి.

– రాఘవేందర్, స్టూడెంట్, మాచారెడ్డి

**సంస్థ ఆదేశాల మేరకు..**

జనరల్, స్టూడెంట్ బస్‌పాస్ ధరలు పెరిగాయి. జనరల్ పాస్‌లు ఇస్తున్నాం. విద్యార్థులకు మాత్రం విద్యాసంస్థ ఇచ్చే ధ్రువీకరణ పత్రం ఆధారంగా జారీ చేస్తాం. ఆన్‌లైన్‌లో చూసిన తర్వాతే ఆ రూట్‌లో నెలవారీ పాస్ ధర ఎంత అనే విషయం తెలుస్తుంది. – కరుణశ్రీ, డిపో మేనేజర్, కామారెడ్డి

# 'భూభారతి' దరఖాస్తులను పరిశీలించాలి

- ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు
- అధికారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, వేదికపై అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

**కామారెడ్డి క్రైం:** జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన భూభారతి దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారంకోసం జిల్లావ్యాప్తంగా ఈనెల 20 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. మొత్తం 31 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆయా దరఖాస్తులను సోమవారం నుంచి పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. భూ సర్వేలకు వచ్చే వాటిని కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. నిర్మాణాలు పూర్తై లబ్ధిదారులకు అందించకుండా పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయడానికి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డులకోసం వచ్చిన, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితా సిద్ధం చేయాలన్నారు. అర్హులకు రేషన్ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### లింగంపేట కార్యదర్శికి షోకాజ్ నోటీస్

**లింగంపేట:** గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై వేటు తప్పదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. శనివారం ఆయన లింగంపేటలోని రాఘవ మెడికల్ చౌరస్తా వద్ద మురికి కాల్వలను పరిశీలించారు. రోడ్డుపై మురికి నీరు, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎందుకు శుభ్రం చేయడంలేదని గ్రామ పంచాయితీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఈ ప్రాంతంలో డెంగీ సోకి కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో 28 కేసులు నమోదు కాగా లింగంపేటలోనే 15 కేసులు నమోదయ్యాయని అధికారులు కలెక్టర్‌తో పేర్కొన్నారు. గతేడాది డెంగీ సోకిన ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అధికారులపై మండిపడ్డారు. లింగంపేట కార్యదర్శి శ్రవణ్‌కుమార్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మురళిని ఆదేశించారు. రోడ్లకిరువైపులా, మురికి కాల్వల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని ఆదేశించారు. రోజూ సానిటేషన్ చేయించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఆర్‌డీవో సురేందర్, డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

### 'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

**కామారెడ్డి అర్బన్:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాల రేడియో స్టేషన్ పాడ్‌కాస్ట్ చర్చాగోష్టిలో ఆయన పాల్గొని పోక్సో చట్టం, నేరాలు, చట్టాలపై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం, పిల్లలపై జరిగే లైంగిక హింస, దోపిడీలు చట్టం దృష్టిలో తీవ్రమైన నేరాలన్నారు. రేడియో స్టేషన్ ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, సమాచార నైపుణ్యం, సృజనాత్మకత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, పాఠశాల చైర్మన్ పున్న రాజేష్, ప్రిన్సిపల్ స్వాతిప్రియ తదితరులు పాల్గొన్నారు.




పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

## క్లుప్తంగా

### బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి



**కామారెడ్డి అర్బన్:** జిల్లాలో బీఎస్పీ బలోపేతం కోసం నాయకులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. పట్టణంలో శనివారం పార్టీ జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంతోష్, మనోహర్‌లను బీఎస్పీలో చేర్చుకున్నారు. జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి సిద్ధిరాములు, రోహిదాస్, ప్రభాకర్‌దాస్ పాల్గొన్నారు.

### మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



**బాన్సువాడ రూరల్:** మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ప్రభుత్వ పరంగా తగిన సహకారం అందిస్తారని చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్‌లు అన్నారు. బాన్సువాడ మండల కార్యాలయంలో శనివారం ఏపీఎం రాజేందర్, పద్మలతో కలిసి డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్పెనియర్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఏపీ) కృషి చేస్తోందన్నారు. పరిశ్రమలశాఖ, పేదరిక నిర్మూలన సంస్థలతో ఒకరోజు ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.ఔత్సాహిక మహిళలను గుర్తించి వారికి 15రోజుల పాటు పరిశ్రమల నిర్వాహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామన్నారు.

### విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



**బాన్సువాడ రూరల్:** ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని విద్యుత్ శాఖ డీఈ ప్రభాకర్ అన్నారు. మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ.. రైతులు సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయరాదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాన్ని తగ్గించడానికి, లూజ్‌లైన్‌ను తొలగించడానికి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. 9మంది రైతుల బోరుబావుల వద్ద కెపాసిటర్ బ్యాంక్‌లను అమర్చారు. ఈడీఈ సంజీవ్‌రావు, ఏఈ అనిల్‌కుమార్, లైన్‌మన్ అక్తర్, ఏఎల్ఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### బడి బాగు కోసం కృషి చేయాలి



**మాచారెడ్డి:** చుక్కాపూర్ బడి బాగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ జెడ్పీటీసీ, పాఠశాల పూర్వ విద్యార్థి మినుకూరి రాంరెడ్డి అన్నారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావడానికి త్వరలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామన్నారు. బ్రహ్మానందరెడ్డి, మమత, దేవేందర్‌రావు, నాగేందర్ ఉన్నారు.



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మోహర్‌బాబా ఫంక్షన్‌హాల్‌లో యోగాసనాలు వేస్తున్న యోగా గురువు బండిరాములు



దోమకొండలో..

# యోగాతోనే ఆరోగ్య సమాజం

- ప్రధాని మోదీతో యోగాకు అంతర్జాతీయ గుర్తింపు
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- జిల్లాకేంద్రంలో అట్టహాసంగా యోగా దినోత్సవం



కామారెడ్డిలోని జిల్లా యోగా భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**కామారెడ్డి అర్బన్:** ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ చందర్ అన్నారు. పట్టణంలోని జిల్లా యోగా భవన్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాచరు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతి వెలిగించి ప్రారంభించగా, ఆయుష్ ఆధ్వర్యంలో సరస్వతి విద్యామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ చందర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పూర్వీకులు అందించిన యోగాకు ప్రధాని నరేంద్రమోదీ అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యోగా సెంటర్లు పెరగడం ఆరోగ్యసమాజానికి నిదర్శనమన్నారు. కామారెడ్డి డివిజనల్ అటవీ అధికారి రమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి వంటశాల ఆరోగ్యశాల కావాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్క నాటడడం ద్వారా ఆరోగ్యవంతమైన ప్రాణవాయువు అందుతుందన్నారు. ఆయుష్ డీపీఎం శ్రీకాంత్, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ప్రకృతి వైద్యులు దేవయ్య, యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రతినిధులు అంజయ్య, యెల్లంకి సుదర్శన్, యోగా గురువు అంజయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు. మోహర్‌బాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యోగాకు ఆధ్యాత్మిక తోడు కావాలని పలువురు ఆశ్రమాధిపతులు అన్నారు. యోగా గురువు బండి రాములు స్వయంగా కఠినమైన ఆసనాలు వేశారు. ఆర్యసమాజంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుతో పాటు పట్టణ, జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సరస్వతి విద్యామందిర్‌లో ఆసనాలు వేస్తున్న అడిషనల్ కలెక్టర్ చందర్, ఆయుష్ వైద్యులు



యోగాసనాలు వేస్తున్న మహిళలు



దోమకొండలోని గడికోటలో..



పిట్లం బ్లూబెల్స్ పాఠశాలలో..



చిన్నటాక్లీ అంగన్‌వాడీలో..



కామారెడ్డిలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్



కామారెడ్డిలోని ఆర్యసమాజంలో..



ఘన్‌పూర్ పాఠశాలలో...

## అతివకు అండగా మహిళా ప్రాంగణం

**మీకు తెలుసా?**



ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణం

ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం అనాథ, విధి వంచిత మహిళలకు 37 ఏళ్లుగా అండగా నిలుస్తోంది.

- ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చేయూతనందించేందుకు అప్పటి సీఎం నందమూరి తారక రామారావు 1988 సంవత్సరంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.
- 11.66 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.
- ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళలు శక్తివంతులు కావడానికి ప్రాంగణంలో వివిధ వృత్తి విద్యా కోర్సులను ఏర్పాటు చేశారు.
- 1997లో బాల కార్మికుల పునరావాస కార్యక్రమంలో భాగంగా బాలికల రెసిడెన్షియల్ బ్రిడ్జి పాఠశాలను ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.
- చదువు మానేసిన, పనిలోకి వెళ్లే, అనాథ పిల్లలను గుర్తించి 776 మందిని చేరదీశారు.
- ఇప్పటి వరకు ప్రాంగణంలో 33 వృత్తి విద్యా కోర్సుల్లో వేల సంఖ్యలో మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు.
- 2001 సంవత్సరంలో అంగన్‌వాడీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు శిక్షణనిస్తున్నారు.
- మహిళా ఆరోగ్య కార్యకర్తలకు 2005 నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

– ఆర్మూర్

## ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలుపుకుంటా



దోమకొండలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



ఉప్పర్‌పల్లిలో..

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

**దోమకొండ:** ఎన్నికల్లో తాను ఇచ్చిన మాట నిలుపుకుంటానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. దోమకొండతోపాటు ముత్యపేట గ్రామంలో శనివారం తన సొంత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు.తన సొంత నిధులతో కుల సంఘాలకు భవనాలు, ఆలయాల నిర్మాణాల కోసం ఇచ్చిన మాట నిలుపుకొని పనులు చేసినట్లు వివరించారు. అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి నరేందర్ రెడ్డి, దోమకొండ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, సెక్రెటరీ అంజన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు మహేందర్ గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు నరేందర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు మనోజ్ కుమార్, గ్రామ అధ్యక్షుడు ముత్తి బుచ్చిరాజు, సెక్రెటరీ నరేస్ గౌడ్, బాలరాజు, తిరుపతిరెడ్డి, దేవరాజు పాల్గొన్నారు.

**బీబీపేట:** మండలంలోని ఉప్పర్‌పల్లి, యాడారం, మల్కాపూర్ గ్రామాల్లోని పలు ఆలయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. నాయకులు సంతోష్‌గౌడ్, రవీందర్, పోసు శివ, దేవరాజుగౌడ్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు




ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



కామారెడ్డిలో తెరవే ఆధ్వర్యంలో..

**కామారెడ్డి క్రైం/ఎల్లారెడ్డి/బాన్సువాడ/కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్:** జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో శనివారం తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా మండలాల్లో జయశంకర్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామారెడ్డిలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జయశంకర్, తెలంగాణ పాటల పొద్దు గూడ అంజయ్యల వర్ధంతిల సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, మలిదశ ఉద్యమకారులు, తెరవే ప్రతినిధులు, స్వర్ణకార సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





బాన్సువాడలో మలిదశ ఉద్యమకారుల ఆధ్వర్యంలో.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

### నరసన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న కోటేశ్వర రావు

**నిజామాబాద్ సిటీ:** దేశానికే అన్నం పెట్టే రైతన్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, వారి సమస్యలు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్‌లో నాయక్‌వాడి నర్సయ్య సంతాప సభ శనివారం నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ నరసన్న అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ప్రశ్నించే వారిని, అమాయక ఆదివాసీలను, ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేస్తుందని వీటిని వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ నర్సయ్య మరణించేంత వరకు రైతు కూలీల సమస్యలపై ఉద్యమించాడని కొనియాడారు. అనంతరం నాయకులు వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, దేశెట్టి సాయరెడ్డి ప్రసంగించారు. పరువయ్య, కారల్ మార్క్స్, గోపాల్, సాయిలు, దిగంబర్, పరిచూరి శ్రీధర్, శివకుమార్, రాజేశ్వర్, భాస్కర్, జీ రమేశ్, భారతి, సూర్య శివాజీ, ఎస్ దాసు, జేపీసీ గంగాధర్, చిన్నయ్య, దేవయ్య, సుప్రియ, నాయక్‌వాడి విజయ తదితరులు పాల్గొన్నారు.

### మొరం దందాకు బీజేపీ వ్యతిరేకం



**బిచ్కుంద(జుక్కల్):** అక్రమ మొరం దందాకు బీజేపీ వ్యతిరేకమని పార్టీ మండల అధ్యక్షుడు శెల్పొల్లి విష్ణు అన్నారు. బిచ్కుందలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిచ్కుందకు చెందిన బీ శ్రీరాం అనే వ్యక్తి బీజేపీ కార్యకర్తగా చెలామణి అవుతూ అక్రమ మొరం రవాణాకు పాల్పడుతున్నాడన్నారు. అతడితో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లెటర్ ఇచ్చినట్లు శ్రీరాం చెప్పుకుంటున్నాడన్నారు. కానీ ఇలాంటి ఫేక్ లెటర్లను నమ్మవద్దని కోరారు. నాయకులు జాదవ పండరి, శివాజీ పటేల్, గణపతి, ధర్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



బోనాల్‌లో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని బోనాల్ గ్రామంలో శనివారం మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలను జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 58 మందికి వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈత కొట్టడం, వల విసరడం, పాంప్రి వల లాగడం తదితర మెలకువలు తెలిపారు. అనంతరం శ్రీపతి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యువజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహకార అసిస్టెంట్ శ్రీనివాస్, మత్స్య సహకార పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గాదం సత్యనారాయణ, జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బట్టు విఠల్, బెస్త సాయిలు, మండల అధ్యక్షుడు దాసరి సాయికుమార్, మత్స్యకారులు పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### అనుమానాస్పదస్థితిలో పార్ట్‌టైం లెక్చరర్ మృతి


- దుర్కి బాలికల గిరిజన పాఠశాలలో ఘటన



స్వప్న (ఫైల్)

**నస్రుల్లాబాద్:** మండలంలోని దుర్కి గ్రామంలో గల తెలంగాణ గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పార్ట్‌టైం కెమిస్ట్రీ అధ్యాపకురాలు స్వప్న(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె సన్నిహితులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం గాండ్లపేటకు చెందిన స్వప్న దుర్కిలోని గిరిజన గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. కాగా, గురువారం సూర్యపేట్ జిల్లా కోదాడలో టెట్ రాసిన స్వప్న, శుక్రవారం విధులకు హాజరైంది. రోజంతా పని చేసినా రాత్రి డ్యూటీ వేశారు. దీంతో రాత్రి పిల్లలను చదివించి నిద్రపోయింది. విద్యార్థినులు ఎంత లేపినా లేవకపోవడంతో సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నామని ఎస్సై లావణ్య తెలిపారు. ఇదిలా ఉండగా స్వప్నకు ఆరోగ్యం బాగోలేక పోయినా ప్రిన్సిపల్ డ్యూటీ వేసి పని ఒత్తిడి కల్పించి ఉండొచ్చని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి వృద్ధులైన తల్లిదండ్రులు, ఇంటర్ చదివే తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కైన కూతురు మరణించడంతో బంధువులు, గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి.

**చికిత్స పొందుతూ యువకుడు..**



హరి(ఫైల్)

**ఇందల్వాయి:** గన్నారం గ్రామానికి చెందిన నాగుల హరి(22) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మూడు రోజుల క్రితం గడ్డిమందు తాగిన హరిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా శనివారం మరణించాడు. హరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతుడు టోల్‌ప్లాజా వద్ద ఫాస్ట్ టాగ్‌లు విక్రయిస్తుండేవాడని తెలిపారు. తండ్రి దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

**బాన్సువాడ :** బాన్సువాడ నాగయ్య చెరువులో దూకి కొండని గంగవ్వ(70) ఆత్మహత్యకు పాల్పడింది. పాత బాన్సువాడ గూడెంగల్లీకి చెందిన గంగవ్వ అనారోగ్యంతో బాధపడుతోంది. గంగవ్వ కుమారుడు రాజు తన అత్తగారి ఊరైన దేశాయిపేటలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. గంగవ్వ మాత్రం బాన్సువాడలోనే ఉంటుంది. వారం రోజుల క్రితం నుంచి గంగవ్వ కుమారుడు, కోడలు వచ్చి గంగవ్వ ఇంట్లోనే ఉంటున్నారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన గంగవ్వ సాయంత్రం చెరువులో శవమై కనిపించింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

### డివైడర్‌ను ఢీకొన్న డీసీఎం

**డిచ్‌పల్లి:** మండలంలోని నడిపల్లి గ్రామశివారు కోతి దేవుడి ఆలయం వద్ద శనివా రం అదుపుతప్పిన డీసీఎం డివైడర్‌ను ఢీకొట్టింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు పాత ఇనుప సామగ్రితో వెళుతున్న డీసీఎం నడిపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. డీసీఎం ముందు భాగం ధ్వంసం కావడంతోపాటు టైరు ఊడిపోయింది.దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు డీసీఎంను పక్కకు తొలగించారు.ప్రమాదానికి సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయలేదని డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

### బాలుడి అప్పగింత



**రుద్రూర్ :** తప్పిపోయిన బాలుడిని రుద్రూర్ మండల కేంద్రంలో పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం .. బాన్సువాడ పట్టణంలోని కోటగల్లికి చెందిన షేక్ ఫర్హాన్ (9) అనే బాలుడు శుక్రవారం తప్పిపోయి రుద్రూర్ బస్టాండ్ పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకొని బాన్సువాడ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వెళ్లడంతో పోలీసులు బాలుడిని అప్పగించారు.

## అటవీశాఖ అధికారులపై గిరిజనుల దాడి

### నిందితుల రిమాండ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

**ఇందల్వాయి:** అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళ అటవీ భూములను చదును చేస్తున్న గిరిజనులను ఆపబోతే ఎదురు తిరిగి అటవీశాఖ అధికారుల మీద దాడి చేసిన ఘటన ధర్పల్లి మండలం కొటాల్‌పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎఫ్ఆర్‌వో రవి మోహన్ భట్, ధర్పల్లి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి రిజర్వ్ ఫారెస్ట్ కొటాల్‌పల్లి బీట్ పరిధిలోని కంపార్ట్‌మెంట్-593లో కొందరు గిరిజనులు చెట్లను నరికి అటవీ భూమిని చదును చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సెక్షన్ అధికారి భాస్కర్, బీట్ ఆఫీసర్లు ఉదయ్, ప్రవీణ్, ఖదీర్ సిబ్బందితో వెళ్లి భూమిని చదును చేస్తున్న గిరిజనులను అడ్డుకొని ట్రాక్టర్‌ను రేంజ్ కార్యాలయానికి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన బూక్య నవీన్, బాదావత్ పూల్‌సింగ్, బూక్య మధు, బూక్య సంగ్య తదితరులు అధికారులపై పొడికారం చల్లి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం అధికారుల నుంచి ట్రాక్టర్‌ని లాక్కొని వెళ్లారు. ఘటనపై శనివారం ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ, సిబ్బందితో కలిసి కొటాల్‌పల్లికి వెళ్లి నిందితులను పట్టుకొని రిమాండ్‌కి తరలించారు. ట్రాక్టర్‌ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. దాడిలో పాల్గొన్న మిగితా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ వివరించారు.

### నిందితుడి అరెస్టు



**ఖలీల్‌వాడి:** రైలులో సెల్‌ఫోన్లను దొంగతనం చేసిన యువకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో సిబ్బంది ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం మీద విధులు నిర్వహిస్తుండగా ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరగడంతో పట్టుకొని విచారించారు. నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన సయ్యద్ మాజీద్ (27)గా గుర్తించారు. ఈ నెల 19న నాగర్‌సోల్, షీర్డీ సాయినగర్ రైలులో మూడు సెల్‌ఫోన్లను దొంగిలించినట్లు చెప్పారు. సెల్‌ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. దొంగను పటుకున్న హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, గురువాస్, కానిస్టేబుల్ రాములును ఎస్సై అభినందించారు.

### నిందితుడిని పట్టించిన సీసీ కెమెరా

**బాన్సువాడ :** పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడిన నిందితుడిని సీసీ కెమెరా సహాయంతో పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోని దుర్గమ్మ మెడలో ఉన్న బంగారు ఆభరణాలు శుక్రవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అర్ధరాత్రి వేళల్లో కాలనీకి చెందిన అనిల్ గుడివైపు రావడం సీసీ ఫుటేజీలో రికార్డయ్యింది. దీంతో అనిల్‌ను విచారించగా కోటదుర్గమ్మ ఆభరణాలు తానే దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని, చోరీకి గురైన సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు.